సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 24 | డిసెంబర్ | 2023



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన భోగిరి భాస్కరరావు, సత్యనాకలక్ష్మీ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని, కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన పొపూరి కృష్ణారావు, ఝాన్సీ రాణీ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని శనివారం సమర్పించారు.



చూచిన కనులదే భాగ్యము

తిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం ఇల వైకుంఠాన్ని తలపించింది. వేద మంత్రా నడుమ దేవేరులతో శ్రీవారు ఉత్తర ద్వారం వద్ద వెండి గరుడ వాహనంపై భక్తజనులకు దర్శనమిచ్చారు.

8లో

11వేల క్యూసెక్కుల నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజి నుంచి డెల్టా కాలువలకు శనివారం 11వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3400,మధ్య డెల్టాకు 1600,పశ్చిమ డెల్టాకు 6000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జగనన్నకు చెబుదాం రద్దు

సాక్షి, అమలాపురం: ఈనెల 25వ తేదీ సోమవారం క్రిస్మస్ సెలవు దినం కావడంతో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 'జగనన్నకు చెబుదాం' నిర్వహించడం లేదని కలెక్టర్ కార్యాలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అధికారులు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సాహసయాత్రలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



అతి ఎత్తైన డ్యామ్‌పైకి వెళ్లిన సాహస బృందం

యానాం: దేశంలో సాహసాలు చేసే యువతకు కొదవలేదు. అనుకూలంగా లేని ప్రాంతాల్లో ఎలా ముందుకు సాగాలో తెలియజేసేలా హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో తర్ఫీదు ఇస్తున్నారు. అక్కడి అడ్వెంచర్ క్యాంప్‌లో యానాం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శనివారం వివిధ విన్యాసాలు చేశారని క్యాంప్ కంటింజెంట్ లీడర్ సరెళ్ల కుమార్ తెలిపారు. ఇప్పటివరకూ హిమాచల్‌ప్రదేశ్‌లోని అతి పెద్ద సరస్సులు, అతి ఎత్తైన ప్రదేశంలో నెలకొల్పిన పాంగ్‌డ్యామ్ హైడల్ ప్రాజెక్టుపైకి ట్రెక్కింగ్ చేశారన్నారు. మైనస్ రెండు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా సాహస యాత్ర సాగిస్తున్నారన్నారు. యానాం, కారైకల్, రాజమండ్రి, మధ్యప్రదేశ్, విజయవాడ నుంచి వచ్చిన 50 మంది వలంటీర్లు సాహస యాత్రలో పాల్గొంటున్నారన్నారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి

కాట్రేనికోన: పాము కాటుకు కౌలు రైతు మృతి చెందాడు. రైతు దినోత్సవం రోజున ఈ ఘటన చోటు చేసుకోవడంతో మల్లయ్యపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. ముమ్మిడివరం మండలం మల్లయ్యపాలేనికి చెందిన కౌలు రైతు మట్టపర్తి సత్యనారాయణ కాట్రేనికోన మండలం చెయ్యేరులో కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. పంట చేనులో నారుమడులు వేస్తుండగా పాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాటన్ బ్యారేజీ రోడ్డు మూత



అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ రోడ్డును మరమ్మతుల కోసం శనివారం మూసివేశారు. వాహన చోదకులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని అధికారులు సూచిస్తున్నారు. బ్యారేజీ రోడ్డు బాగా శిథిలమైంది. దీంతో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. రోడ్డులోని 6.8 కి మీటర్ల మేర పనులు జరుగుతాయి. ఇందుకోసం రూ.2 కోట్లు కేటాయించారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేసి, ప్రజలను అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు.

సత్యదేవునికి ముత్తంగి, నిజరూప దర్శన సేవలు పునరుద్ధరణ

అన్నవరం: రత్నగిరిపై భక్తుల రద్దీ కారణంగా సత్యదేవునికి గత కార్తీక మాసంలో నిలిపివేసిన ముత్తంగి సేవ, నిజరూపదర్శన సేవలను పునరుద్ధరిస్తున్నట్లు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ముత్యాల వస్త్రాల కవచాలను స్వామి, అమ్మవార్లకు అలంకరించి ముత్తంగి సేవ, ఆభరణాలు లేకుండా ప్రతి గురువారం స్వామి, అమ్మవార్ల నిజరూపదర్శనం ఉంటుందని వివరించారు.

సెల్‌లో బంధీలు



సురేష్ జేఎన్‌టీయూకేలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తెల్లవారుజామున లేచింది మొదలు అర్ధరాత్రి వరకు మొబైల్ ఫోన్ చూస్తూనే ఉంటాడు. పరీక్షలు సమీపిస్తున్నాయని ఇంట్లో కుటుంబ సభ్యులు అడిగితే చివర్లో చదివేస్తానంటూ బదులిస్తున్నాడు. చేతిలో మొబైల్ లేకుండా ఉండలేనంతగా మారిపోయాడు. పరీక్షలు వచ్చినా ఇతని వైఖరిలో మార్పు లేదు. ఫలితాలు చూసేసరికి సబ్జెక్టులన్నీ ఫెయిలయ్యాడు. బిడ్డ తీరు చూసి తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతం.

రాజేష్‌ది కాట్రేనికోన. తండ్రి వ్యవసాయం చేస్తుంటాడు. తల్లి గృహిణి. ఉన్నంతలో మంచి ప్రైవేట్ స్కూలులో జాయిన్ చేశారు. రోజూ స్కూలుకు వెళ్లి వస్తుంటాడు. స్కూలు నుంచి రాగానే తండ్రి కొనిచ్చిన మొబైల్ ఫోన్‌లో మునిగి తేలుతుంటాడు. ఇందులో కూడా పాఠాలు చదువుకుంటున్నానని తల్లికి చెబుతున్నాడు. కానీ మార్కులు చూస్తే దారుణం. కుర్రాడి పరిస్థితి అర్థమైన తల్లిదండ్రులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. సెల్ వ్యసనాన్ని ఎలా మానిపించాలో తెలియక తలపట్టుకుంటున్నారు.

- మొబైల్ ఫోన్ వీక్షణలో కాలహరణం
- కెరీర్‌ను కాలదన్నుకుంటున్న టీనేజ్
- 22-25 వయస్సుల వారే అధికం
- నగటున రోజులో నాలుగున్నర గంటలు వృథా
- తలపట్టుకుంటున్న తల్లిదండ్రులు

సాక్షిప్రతినిధి,కాకినాడ: రాజేష్..సురేష్‌లు మాత్రమే కాదు. చాలా మంది విద్యార్థులది ఇదే తీరు. చేతిలో మొబైల్ ఉండాల్సిందే. ఇంట్లో ఉన్నంతసేపు సెల్‌తోనే కాలమంతా గడిపేస్తున్నారు. బిడ్డల భవిష్యత్ కోసం బంగారు కలలు కనే తల్లిదండ్రులకు ఇదో పెద్ద సమస్యగా తయారైంది. మొబైల్ ఫోన్ల నుంచి వీరిని ఎలా దూరం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. విలువైన కాలాన్ని వృథా చేస్తున్న బిడ్డల తీరుపై ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చాలామంది చదువుకుంటున్న చిన్నారుల నుంచి యువత వరకూ ఈ మొబైల్‌తోనే కాలక్షేపం చేసేస్తున్నారు. విలువైన భవిష్యత్‌ను చేజేతులా పాడుచేసుకుంటున్నారు. దీనిపై చాలా ఇళ్లలో ఇది నిత్యం వివాదాలకు కారణమవుతోంది.

అప్‌డేట్‌గా ఉంటే మంచిదే.. కానీ..

వాస్తవానికి మొబైల్ ఫోన్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీక. దీనిని సద్వినియోగం చేసుకుంటే చాలా ఉపయోగం. కానీ కెరీర్‌కు ఉపయోగపడని అంశాలను చూస్తుంటే కీలకమైన కాలం కాస్తా కరిగిపోతుంది. ఫలితంగా భవిష్యత్‌కు నష్టం జరుగుతుంది. కమ్యూనికేషన్‌కు..ఎప్పటికప్పుడు తమ సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై అప్‌డేట్‌గా ఉంటే మంచిదేనని.. కానీ అలా ఎక్కువ మంది విషయంలో ఇలా జరగడం లేదని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఒకరు చెప్పారు. అరచేతిలో ప్రపంచాన్ని వీక్షించే వీలున్న ఈ చిన్న ఆధునిక పరికరం ద్వారా మేలైన జీవితానికి బాటలు వేసుకోవచ్చునంటున్నారాయన. అలాగని నిరంతరం దానిని వాడడమే వ్యసనంగా పెట్టుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉండదంటున్నారు.

మరీ ఇంత వ్యసనంగానా..

దాదాపు అన్ని వయసుల పిల్లలలో ఎక్కువ మంది రోజులో నాలుగు గంటల పాటు మొబైల్ ఫోన్ల ద్వారా సామాజిక మాధ్యమాల్లో ఉంటున్నారని ఇటీవల ఒక అధ్యయనంలో తేలింది. ఇలా నెలలో 120 గంటలు.. అంటే సుమారు నాలుగున్నర రోజులు. ఏడాదికి 54 రోజుల పాటు మొబైల్ ఫోన్ చూడటంలోనే కాలం గడిపేస్తున్నారని అంచనా. ఇది చాలా ప్రమాకరమైన పోకడ. తరచూ ఫోన్ చూడటం మానసిక రోగంలా తయారైందని సైకియాట్రిస్టులు అంటున్నారు.

పరీక్షా కాలంలోనూ..

పరీక్షలకు ముందు విద్యార్థులకు ప్రతి క్షణం చాలా విలువైనది. ఏ సమయంలో ఏది చేయాలో అదే చేయాలి. చదువుపై దృష్టి పెట్టాలని తల్లిదండ్రులు, టీచర్లు పదే పదే చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. పరీక్షలు దగ్గరపడే సమయంలోనైనా మొబైల్‌కు కాస్త దూరంగా ఉంటే మంచిదని చెబుతున్నా ప్రయోజనం కనిపించడం లేదని తల్లిదండ్రులు కలవరపడుతున్నారు. కెరీర్‌ను మలుపు తిప్పే పదో తరగతి నుంచి డిగ్రీ లేదా, ఇంజినీరింగ్ మధ్య చదువుల్లో ఉన్న విద్యార్థులను ఈ 'మొబైల్ ధోరణి' దెబ్బతీస్తోందని విద్యావంతులు హెచ్చరిస్తున్నారు. సహజంగా 20-22 వయస్సు మధ్య గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తారు. పీజీ ఇతర ఉన్నత విద్యా కోర్సులు 25 ఏళ్లకు పూర్తి చేసి ఉద్యోగం సాధించాలి. కానీ ఈ మొబైల్ విచ్చలవిడి వినియోగంతో పాతికేళ్లు దాటినా బ్యాక్‌లాగ్‌లు వెంటాడుతున్నాయి. ఉద్యోగం సంపాదించాల్సిన సమయంలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితర సామాజిక మాధ్యమాల ప్రభావంలో పడి నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు.



పెరుగుతున్న మానసిక రుగ్మతలు

మొబైల్ వినియోగం ద్వారా మానసిక రుగ్మతలతో బాధపడుతున్న పిల్లల సంఖ్య క్రమేపీ పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. మానసిక సంబంధ సమస్యలతో బాధపడే ప్రతి పది మందిలో నలుగురైదుగురు 25 ఏళ్ల లోపు వారే ఉంటుండటం ఆందోళన కలిగిస్తోందని మానసిక వైద్యులు పేర్కొంటున్నారు. ఇలాంటి వారిని లోతుగా పరిశీలిస్తే సెల్‌ఫోన్ వ్యసనమే కారణమని తెలుస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనాభా 51 లక్షల పై మాటే. ఈ జనాభా ఆధారంగా మొబైల్ విచ్చలవిడి వినియోగంలో 20 నుంచి 22 ఏళ్ల వయసు ఉన్న వారిలో అత్యధికంగా 60 శాతం ఉంటున్నారని అంచనా.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొబైల్ ఫోన్ ప్రభావిత యువత

వయసు	ఎంత మంది	నిరంతర వీక్షకుల శాతం
18	1,13,184	60
19	91,775	55
20	1,31,406	65
21	84,246	60
22	98,661	65
23	85,392	70
24	90,638	65
25	1,38,861	75

ఈ తరం విద్యార్థులంతా 'సెల్'కు బానిసలవుతున్నారు



సెల్‌ఫోన్ వినియోగం విద్యార్థుల బంగారు భవితను చిదిమేస్తోంది. మారుతున్న జీవన శైలి, అలవాట్ల కారణంగా విద్యార్థులంతా సెల్‌క ఎడిక్ట్ అవుతున్నారు. ఈ దుస్థితికి పసిప్రాయంలోనే బీజం పడుతోంది. చిన్నపిల్లల దశలో మారాం చేస్తేనో, తిననని మొరాయిస్తేనో వెంటనే వారి చేతిలో సెల్‌ఫోన్ పెట్టడం పరిపాటిగా మారింది. సరిగ్గా ఈ పరిస్థితి వారి యావత్ జీవితంపై ప్రభావాన్ని చూపుతోంది. కేవలం సెల్‌ఫోన్లకు బానిసై మానసిక రోగులుగా మారిన ఎందరో విద్యార్థులు చికిత్సకు వస్తున్నారు. బెట్టింగ్‌లు, పోర్న్ వంటి దురలవాట్లకు బానిసలవుతున్నారు.

– డాక్టర్ వానపల్లి వరప్రసాద్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, కాకినాడ

ఆధునిక పరిజ్ఞానం కోణంలో చూడాలి



నేటి కాలంలో ప్రతి ఒక్కరి వద్ద మొబైల్ ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ముఖ్యంగా కోవిడ్ కాలంలో ఆన్‌లైన్ క్లాసులతో వినియోగం పెరిగిపోయింది. విద్యార్థి స్థాయి నుంచి మొబైల్‌తో పాటు ట్యాబ్ వినియోగం పెరిగిపోయింది. ప్రతి విద్యార్థి వద్ద మొబైల్ తప్పనిసరిగా ఉంటున్న నేపథ్యంలో చెడు అలవాట్లు, ఆన్‌లైన్ బెట్టింగులు వంటి వాటికి అలవాటు పడి విలువైన కాలం వృథా చేస్తున్నారు. దేశ అభివృద్ధికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తెలిసిన యువత అవసరం. ఆ కోణంలో సెల్‌ఫోన్ వినియోగించుకోవాలని. భవిష్యత్‌కు అది సోపానం కావాలి.

– డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, ఐఎస్‌టీ డైరెక్టర్, జేఎన్టీయూకే

భీమేశ్వరుని క్యాలెండర్ ఆవిష్కరణ



ద్రాక్షారామ భీమేశ్వరుని నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారి 2024 క్యాలెండర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం ఆవిష్కరించారు. ముందుగా ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో మంత్రి వేణుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి పుట్టిన రోజు సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నంది మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అనంతరం ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, సాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టం రక్షణ కవచం

- జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్
- ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం
- విద్యార్థులకు, ప్రజలకు అవగాహన



డ్రగ్ కంట్రోలర్, ఆహార భద్రత శాఖ, లీగల్ మెట్రోలజీ శాఖ స్టాళ్లను పరిశీలిస్తున్న జేసీ నూపుర్ అజయ్

అమలాపురం రూరల్: వస్తు సేవల్లో లోపాల నుంచి వినియోగదారుల చట్టం రక్షణ కల్పిస్తుందని కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ అజయ్ పాల్గొని వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై జిల్లాలోని విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో తొలుత డ్రగ్ కంట్రోలర్, ఆహార భద్రత శాఖ, లీగల్ మెట్రాలజీ సిబ్బంది స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలు ఉపయోగించే మందులు కొనుగోలు, తినుబండారాలు, డిజిటల్ లావాదేవీలపై తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు, ప్రజలకు వివరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ నాసిరకం ఉత్పత్తులు, నకిలీ ప్రకటనలు, తప్పుడు ఆఫర్లు అనేక ఇతర అన్యాయమైన వాణిజ్య పద్ధతుల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడానికి వినియోగదారుల రక్షణ బిల్లు 1986 డిసెంబర్ 24న రాష్ట్రపతి ఆమోదం పొంది అమలులోకి వచ్చిందని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 24న ప్రతి సంవత్సరం వినియోగదారులకు వారి హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించే లక్ష్యంతో జాతీయ వినియోగదారుల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 2019లో పాత చట్టానికి (వినియోగదారుల రక్షణ చట్టం-1986) మార్పులు చేస్తూ ఎలక్ట్రానిక్ ఫోరమ్స్‌లో కొనుగోలు చేసిన వస్తువులను ఈ చట్ట పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఈ చట్టానికి సవరణ చేసిందన్నారు. ఈ చట్టం వినియోగదారులందరికీ కవచం లాంటిదన్నారు. ఈ చట్టం ప్రకారం సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ చట్టం కింద ఫిర్యాదులు ఇవ్వాలంటే రూ.5 లక్షల రూపాయల వరకు ఎటువంటి ఫీజు అవసరం లేదన్నారు. ఆ తరువాత నామమాత్రపు కోర్టు ఫీజు చెల్లించి వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో స్కూళ్లు, కళాశాలల్లో కన్స్యూమర్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మండల, జిల్లా స్థాయిలో వినియోగ దారుల హక్కుల గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ మాట్లాడుతూ వినియోగదారులు వారికున్న హక్కులు తెలిసినపుడే బాధ్యతగా వ్యవహరిస్తారన్నారు. జిల్లాస్థాయిలో వినియోగదారుల హక్కులపై అవగాహనకు విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, క్విజ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు జేసీ నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.పాపారావు, తూనికలు కొలతల అధికారి రాజేష్, వివిధ వినియోగదారుల సంఘ ప్రతినిధులు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీల నియామకం

- విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా శిరీష్
- యువజన విభాగానికి బాబి



అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కమిటీలను పార్టీ అధిష్టానం నియమించింది. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంవీఎస్ శిరీష్ నారాయణస్వామి (పి.గన్నవరం నియోజకవర్గం) నియమితులు కాగా, ఉపాధ్యక్షులుగా తాడి సహదేవ్ (రాజోలు), మట్టపర్తి మణికుమార్ (ముమ్మిడివరం) నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా బళ్ల కీర్తిబాబు, (పి.గన్నవరం), సాదే శ్రీనివాస్ (రామచంద్రపురం), పి.వివేక్ (అమలాపురం), బండారు వెంకటేశ్వరరావు (రాజోలు), ఎన్.శాస్త్రి (కొత్తపేట), మేడిశెట్టి కిషోర్ (మండపేట), కార్యదర్శులుగా దంగేటి శ్రీప్రసాద్ (పి.గన్నవరం), యన్నాబత్తుల దుర్గాప్రసాద్ (పి.గన్నవరం), నక్కా శివ (ముమ్మిడివరం), రాజులపూడి కృష్ణ (ముమ్మిడివరం), తెర్రి వెంకటరమణ (రామచంద్రపురం), కోటిపల్లి శివాజీ (రామచంద్రపురం), జి.బాబీ (అమలాపురం), కె.శివరామకృష్ణ (అమలాపురం), జిలేల ఉదయ్ కిరణ్ (రాజోలు), కండిబోయిన జయకుమార్ (రాజోలు), వి.మల్లేష్ (కొత్తపేట), యు.నాగ సురేష్ (కొత్తపేట), కొల్లి రాజు (మండపేట), యడ్ల గంగరాజు (మండపేట), సంయుక్త కార్యదర్శులుగా శెట్టి శ్రీరామ్ (పి.గన్నవరం), దేవరపల్లి గౌతమ్ నంద (పి.గన్నవరం), అమర్ కుమార్ (ముమ్మిడివరం), పాటి అభి (రామచంద్రపురం), కుడుపూడి క్రాంతి (రామచంద్రపురం), కె.ప్రవీణ్ (అమలాపురం), టి.రామ్‌కుమార్ (అమలాపురం), చెల్లింగి నవీన్ కుమార్ (రాజోలు), యల్లమిల్లి కిశోర్ (రాజోలు), పి.చరణ్ (కొత్తపేట), చేమకూర మణికంఠ (కొత్తపేట), అబ్బిరెడ్డి వీర్రాజు (మండపేట) నియమితులయ్యారు.

అలాగే యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా సూరిశెట్టి బాబి (రాజోలు), ఉపాధ్యక్షులుగా అక్కల శ్రీధర్ (ముమ్మిడివరం), కాండ్రేగుల రామిరెడ్డి (పి.గన్నవరం) నియమితులయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా ఓలేటి శ్రీను (ముమ్మిడివరం), పల్లి కళ్యాణ్ (రామచంద్రపురం), దాసరి రామచంద్రమూర్తి (అమలాపురం), వెల్ల మిధున్ చక్రవర్తి (రాజోలు), నార్ల ప్రసాద్ (కొత్తపేట), తణుకు అశోక్ (మండపేట) నియమితులయ్యారు. కార్యదర్శులుగా మద్దింశెట్టి శ్రీరామ్ (పి.గన్నవరం), కుడుపూడి సత్తిబాబు (పి.గన్నవరం), భైరవమూర్తి (ముమ్మిడివరం), సంగాని శివకుమార్ (ముమ్మిడివరం), వల్లు శివ (రామచంద్రపురం), పెంటపాటి శ్రీను (రామచంద్రపురం), చప్పిడి సతీష్ (అమలాపురం), మానే కృష్ణ (అమలాపురం), కానూరి దుర్గా ప్రసన్నకుమార్ (రాజోలు), పిండి వి.నర్సయ్యనాయుడు (రాజోలు), పువుల ప్రసాద్ (కొత్తపేట), కె.కాశీ కృష్ణ (కొత్తపేట), కొప్పిరెడ్డి రామకిషోర్ (మండపేట), చేకూరి సురేష్ (మండపేట), సంయుక్త కార్యదర్శులుగా నాగాబత్తుల రాజేష్ (పి.గన్నవరం), చిట్టూరి రవికుమార్ (పి.గన్నవరం), నక్కా సుదర్శనం (ముమ్మిడివరం), దడాల కుమార్ (రామచంద్రపురం), దంగేటి గౌరీ శంకర్ (రామచంద్రపురం), బొంతు ఆదినారాయణ (అమలాపురం), బి.శ్యామ్ (అమలాపురం), యాతం మణికంఠ (రాజోలు), బొక్కా శ్రీను (రాజోలు), ఎం.విజయ చక్రవర్తి (కొత్తపేట), ఎం.అర్జునరావు (కొత్తపేట), మేడపాటి పృథ్వీ రెడ్డి (మండపేట) నియమితులయ్యారు.

క్లుప్తంగా

పంట కాలువలోకి దూసుకువెళ్లిన లారీ

- చేపల పెట్టెలు క్యాబిన్‌పై పడి డ్రైవర్‌తో సహా నిద్రిస్తున్న యజమాని మృతి



ఘటన స్థలంలో మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు



భార్యతో గంగాధర్ (ఫైల్)

గండేపల్లి: గాలాడక ఆగిన శ్వాస. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో పాటు నిద్రపోతున్న వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందారు. ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం మేరకు పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం పెంటపాడు గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి రాంబాబు (51), పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లికి చెందిన లారీ యజనాని రేపల్లె గంగారావు అలియాస్ గంగాధర్ (37) చేపల లోడు లారీతో శుక్రవారం రాత్రి 11 గంటలకు తాడేపల్లిగూడెం నుంచి బయలుదేరి అస్సాం రాష్ట్రం తేచుంకీ వెళ్తున్నారు. రాంబాబు వాహనాన్ని నడుపుతుండగా, గంగాధర్ నిద్రిస్తున్నాడు. మండలంలోని నీలాద్రిరావుపేట రామభద్ర చెరువు వద్దకు వచ్చే సరికి ఆ వాహనం రహదారి పక్కనే ఉన్న ఎలక్ట్రికల్ దుకాణాన్ని ఆనుకుని ఉన్న పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనతో లారీ వెనుకభాగంలో ఉన్న చేపల పెట్టెలు కేబిన్ మీదకు దూసుకుపోవడంతో ఆ భాగం తునాతునకలైంది. కేబిన్‌లో ఇరుక్కున్న రాంబాబు, గంగాధర్‌లపై చేపల బాక్సులు పడటంతో ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రోడ్ సేఫ్టీ, హైవే నిర్వహణ సిబ్బంది మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గంగాధర్‌కు భార్య రమాదేవి, హర్షిత (7), నందిని (5) ఉన్నారు. రాంబాబు భార్య లక్ష్మి దుబాయిలో ఉంటున్నది. వాహనాన్ని ఇటీవలే కొనుగోలు చేసినట్టు గంగాధర్ బంధువులు తెలిపారు. అతని మృతితో ఆ కుటుంబం ఆధారం కోల్పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

చూచిన కనులదే భాగ్యము

- వైకుంఠవాసుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం నుంచి ప్రవేశాలు



వాడపల్లి వేంకటేశ్వర ఆలయంలో స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం



శేష వాహనంపై వాడపల్లిలో శ్రీవేంకటేశ్వర స్వామి



అన్నవరంలో శేషవాహనంపై దేవేరులతో స్వామివారు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారి కల్యాణం, బాలభోగం తదితర పూజలు చేశారు. ఉత్తర ద్వారం నుంచి వెళ్లిన భక్తులు శేషపాన్పుపై ఉన్న స్వామివారిని, అనంతరం ప్రధాన ఆలయంలోని మూల విరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి తదితర ఆలయాల్లో పూజలు చేశారు. స్వామికి రూ.44,19,982 ఆదాయం వచ్చిందని, సుమారు 60 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.

అప్పనపల్లి బాలాజీ సన్నిధిలో..

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ దర్శనానికి 10,394 మంది భక్తులు తరలివచ్చారు. దర్శనానంతరం మొక్కులు తీర్చుకుని స్వామి వారి నిత్యాన్నదాన ప్రసాదాన్ని 6,852 మంది స్వీకరించారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.6,41,530 ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.5,21,961 ఆదాయం సమకూరింది. స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.1,19,569 విరాళంగా వచ్చాయి. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని 10 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. అనంతరం కంచుగరుడ వాహనంపై మాడ వీధుల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

విజయదుర్గా పీఠంలో..

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ద్వార దర్శనం ముక్తికి మార్గమని పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. శనివారం పీఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ద్వారకాతిరుమల: అలాగే ద్వారకా తిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం ఇల వైకుంఠాన్ని తలపించింది. వేద మంత్రా నడుమ దేవేరులతో శ్రీవారు ఉత్తర ద్వారం వద్ద వెండి గరుడ వాహనంపై భక్తజనులకు దర్శనమిచ్చారు. ఉదయం 4.30 గంటలకు ఉత్తర ద్వారాలను తెరవగా ఈఓ వేంద్ర త్రినాథ రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు తదితరులు స్వామివారిని దర్శించి, పూజాదికాలు చేశారు. సుమారు 40 వేల మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శించారు. అలాగే జిల్లాలోని కోరుకొండలోని లక్ష్మీ నృసింహస్వామిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు.

సత్యదేవుని సన్నిధిలో..



అన్నవరంలో సత్యదేవుని దర్శనానికి వెళ్తున్న భక్తులు

అన్నవరం : కట్టెదురా వైకుంఠము.. కాణాచైన కొండ.. అని పదకవితా పితామహుడు అన్నమయ్య వేంకటేశుని కీర్తించినట్టు రత్నగిరి శనివారం వైకుంఠాన్ని తలపించింది. ముక్కోటి ఏకాదశి, అందునా శనివారం శేష శయనుడైన స్వామివారు దేవేరులతో సత్యదేవుని రూపంలో అనంత లక్ష్మి, సత్యవతీదేవి సమేతంగా భక్తకోటికి దర్శనమిచ్చారు. ఉత్తర ద్వారం నుంచి దేవేరీ సమేతుడైన అయ్యవారిని దర్శించిన భక్తులు పులకాంకితులయ్యారు. తెల్లవారుజామున 3-30 గంటలకు ఆలయాన్ని తెరిచి సుప్రభాతసేవ చేసి, నాలుగు గంటలకు సత్యదేవునికి, లక్ష్మీదేవి అలంకరణలో అనంతలక్ష్మి, సత్యవతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఐదు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు దర్శనాలు కల్పించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్, ఏసీ డీఎల్‌వీ రమేష్ బాబు, సత్యదేవుడు, అమ్మవార్ల వజ్ర కిరీటాల దాత మట్టే సత్యప్రసాద్ తదితరులు స్వామివారిని, అనంతరం గర్భాలయంలోని సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతి అమ్మవార్లను దర్శించుకున్నారు.

విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర పూజలు

4.45 గంటలకు విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి సత్యదేవుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలకగా ఆయన స్వామివారికి కర్పూర హారతి సమర్పించారు.

తరలివచ్చిన భక్తజన సంద్రం

పుష్పాలంకరణతో శోభిల్లిన ఉత్తర ద్వారం నుంచి వచ్చిన భక్తజనానికి విష్ణుమూర్తి అవతారంలో ఉన్న సత్యదేవుడు, సత్యవతీదేవి భక్తులకు కనువిందు చేశారు. గర్భాలయంలో తూర్పుముఖంగా ఉన్న స్వామి, దేవేరులను వారు దర్శించుకుని పశ్చిమ ద్వారం నుంచి వెలుపలికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉత్తర ద్వార దర్శనాలు కల్పించిన అధికారులు అనంతరం యథావిధిగా దక్షిణ ద్వారం నుంచి లోపలికి పంపి ఉత్తర ద్వారం నుంచి వెలుపలకు పంపించారు.

ఈ సందర్భంగా అంతరాలయ దర్శనాలను అధికారుల రద్దు చేశారు. తెల్లవారుజామున స్వర్ణ పుష్పార్చన, ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు సహస్ర తులసి దళార్చన, నీరాజన, మంత్రపుష్పాలు, అవసర నివేదనలు సమర్పించారు.

స్వామిని దర్శించిన 50 వేల మంది

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం సుమారు 50 వేల మంది భక్తులు స్వామిని దర్శించి పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం పై పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిపోయాయి. స్వామివారి వ్రతాలు 3,500 జరగగా, వివిధ విభాగాల ద్వారా రూ.50 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా రథోత్సవం..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా వెండి రథంపై స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. స్వామివారి రథం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. కదంబ ప్రసాదాన్ని స్వామి, అమ్మవార్లకు నివేదించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

ప్రధాన వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, ఉపప్రధానార్చక ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, అర్చకులు సుదీర్, పవన్, వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, ఇతర వైదిక బృందం ప్రత్యేక పూజలు చేశారు.

శృంగార వల్లభుని దర్శనానికి..

పెద్దాపురం/సామర్లకోట/పిఠాపురం: కాకినాడ జిల్లాలలోని తొలి తిరుపతిగా ఖ్యాతి పొందిన స్వయంభూ శంగారవల్లభ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే సామర్లకోట మండలంలోని మాండవ్య నారాయణస్వామి, పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి దర్శనాలకు భక్తులు భారీగా తరలివచ్చి ఉత్తర ద్వారం నుంచి దర్శనాలు చేసుకున్నారు.

పుట్టినరోజే మృత్యు ఒడికి..



మృతుడు వెంకటేశ్వర్రావు

కాజులూరు: అతి వేగం ఓ యువకుడి ప్రాణం తీసింది. పుట్టినరోజే అతడు మృత్యు ఒడికి చేరుకున్నాడు. అతడితో ఉన్న దివ్యాంగ యువకుడిని స్థానికులు రక్షించారు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజులూరు పద్మశాలీలపేటకు చెందిన కాకి వెంకటేశ్వర్రావు (వెంకీ 37) పుట్టినరోజు శనివారం కావటంతో శుక్రవారం కాకినాడ వెళ్లి తన మిత్రుడు జక్కిలంక శ్రీనుతో కలసి శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు తన మోటారు బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. గొల్లపాలెం శివాలయం వద్దకు వచ్చే సరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న తాగునీటి బావిని ఢీకొట్టింది. దీంతో వారిరువురు ఎగిరి బావిలో పడిపోయారు. దివ్యాంగుడైన శ్రీను బావిలోని చిన్నపాటి రాళ్లను పట్టుకుని కేకలు వేయగా అటుగా వెళ్తున్న స్థానికులు విని వచ్చి ఇద్దరినీ బయటకు తీశారు. అప్పటికే వెంకటేశ్వర రావు మృతి చెందాడు. ఏసీటీ చానల్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న అతడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్సై తులసీరామ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్నిస్‌లో కాకినాడ క్రీడాకారుల ప్రతిభ



విజేతలుగా నిలచిన కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ టౌన్ హాల్‌లో జిల్లా లాన్ టెన్నిస్ సంఘం సహకారంతో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్ పోటీలలో కాకినాడ క్రీడాకారులు ప్రథమస్థానంలో నిలిచారు. డాక్టర్ గిరి, రవి ఆధ్వర్యంలో నిర్వహించిన జీఎస్ఎన్ మూర్తి స్మారక టెన్నిస్ పోటీల్లో వెటరన్ కేటగిరీలో డబుల్స్‌లో ఎస్‌వీ కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి కప్‌ను కైవసం చేసుకున్నారు. వారిని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, ఎంఎల్సీ కర్రి పద్మశ్రీ, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కేటీఏ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ శనివారం అభినందించారు.

వివాహిత ఆత్మహత్య



రత్నకుమారి (ఫైల్)

ముమ్మిడివరం: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలో అయినాపురానికి చెందిన గంధం రత్నకుమారి (30) శనివారం తెల్లవారుజామున ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మామిడికుదురు మండలం పెదపట్నంలంకకు చెందిన రత్నకుమారికి 2012లో అయినాపురానికి చెందిన వీరబాబుతో వివాహం అయింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసైన వీరబాబు తరచూ ఆమెను వేధిస్తుండడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. తమ కుమార్తెను వీరబాబు హత మార్చాడని రత్న కుమారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రత్నకుమారి సోదరుడు కామిశెట్టి ఇషాంత్ ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ విష్ణు స్వరూప్, ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.